క్లుప్తంగా

లేపాక్షిలో డిస్కౌంట్ సేల్



కార్తిక్ కుమార్, లేపాక్షి మేనేజర్

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలోని లేపాక్షి ఎంపోరియంలో భారీ డిస్కౌంట్‌తో వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయని నగర మేనేజర్ ఎ.కార్తిక్ కుమార్ తెలిపారు. ఎంపిక చేసిన వస్తువులపై 10 శాతం నుంచి 40 శాతం వరకూ భారీ డిస్కౌంట్లు ఇస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ వరకూ డిస్కౌంట్ ఉంటుందన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న కందుల దుర్గేష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకలలో భాగంగా రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ధన్వంతరి బ్లడ్‌బ్యాంక్‌లో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జనసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ప్రారంభించారు. అధిక సంఖ్యలో మెగాభిమానులు రక్తదానం చేశారు.

మానసిక ఒత్తిడిని దూరం పెట్టాలి



డాక్టర్ రామారెడ్డిని సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: మానసిక ఒత్తిడిని దూరం చేసుకుంటే ప్రశాంతంగా జీవించవచ్చని ప్రముఖ మానసిక వైద్యుడు, బీసీ రాయ్ అవార్డు గ్రహీత కర్రి రామారెడ్డి అన్నారు. స్థానిక వెంకటేశ్వర నగర్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో ఆదివారం జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడి, కథా కమామిషు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి రామారెడ్డిని సత్కరించి, మెమెంటో ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి

ప్రకాశం నగర్: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి నిర్వహించారు. స్వరాజ్యం చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం అరాచకాలకు, భూస్వాములకు వ్యతిరేకంగా రైతాంగాన్ని, కార్మికులను పెద్ద ఎత్తున సమీకరించి తుపాకీ పట్టి పోరాడిన వీరనారి మల్లు స్వరాజ్యమని గుర్తు చేశారు. నగర కార్యదర్శి బి.పవన్, నాయకులు బి.రాజులోవ, పి.తులసి పాల్గొన్నారు.

స్టాలిన్‌కు పరామర్శ

కడియం: జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్‌ను ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. స్టాలిన్ ఇటీవల కళ్ల ఆపరేషన్ చేయించుకున్నారు.

గజల్ శ్రీనివాస్‌కు సత్కారం



గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నర్సరీ రైతులు, ముసలమ్మ ఆలయ కమిటీ సభ్యులు

కడియం: పర్యాటకంగా అభివృద్ధి చెందిన కడియపులంకలో గతంలో అప్పటి కేంద్రమంత్రి చిరంజీవి శంకుస్థాపన చేసిన ఎకోటూరిజంను పూర్తి చేయాలని తాను పర్యాటకశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని అభ్యర్థిస్తానని ప్రముఖ కళాకారుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన కడియపులంక సత్యదేవ (చిన సత్యనారాయణ) నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవ్ టెంపుల్ బారత్ వ్యవస్థాపక చైర్మన్‌గా, ఆంధ్రసారస్వత పరిషత్ అధ్యక్షుడిగా తాను ఆంధ్రమేవజయతే అనే నినాదంతో పనిచేస్తున్నానన్నారు. అనంతరం గజల్ శ్రీనివాస్‌ను నర్సరీ రైతులు, ముసలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. గ్రామదేవత ముసలమ్మను ఆయన దర్శించుకున్నారు. సత్యదేవ నర్సరీ అధినేత పుల్లా చంటియ్య, పుల్లా అబ్బులు, వీర వెంకట్రావు, డాక్టర్ రామకృష్ణ, వీర్రాజు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ముప్పాళ్ల

కంబాలచెరువు/ప్రకాశం నగర్: చలో అసెంబ్లీ కార్యక్రమం సోమవారం తలపెట్టిన నేపథ్యంలో జీవో నెంబర్ 1 రద్దు ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ముప్పాళ్ల సుబ్బారావును ఒకటో పట్టణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఆ కార్యక్రమం కోసం విజయవాడ వెళుతున్న నాయకులను ఆదివారం మధ్యాహ్నం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తాటిపాక మధు తదితరులకు నోటీసులు జారీ చేశారు.

వడ్డీ ఎర... అసలుకు చెర



కడియంలో జయరామ్ చేసిన మోసాన్ని డీఎస్పీకి వివరిస్తున్న బాధితులు (ఫైల్)

- మోసం చేస్తున్న ప్రబుద్ధులు
- అప్పు ఇచ్చిన వారికి తప్పని శోకం
- పెరుగుతున్న ఘటనలు

కడియం: నర్సరీలో కూలి పనులు చేసుకునే వారు కొందరు.. పువ్వులు కట్టి రూపాయి రూపాయి పోగేసుకున్నవారు ఇంకొందరు.. చిరుద్యోగులు మరి కొందరు..నోరు కట్టుకుని డబ్బులు పోగేసుకుని తెలిసిన వాళ్లకు అప్పుగా ఇస్తే ఆ వడ్డీతో కుటుంబానికి అదనపు ఆదాయం వస్తుందన్న ఆశ.. అయితే వీరి ఆశను, నమ్మకాన్ని పెట్టుబడిగా భావించి మోసం చేయడానికి సిద్ధంగా ఉంటున్నారు ఇంకొందరు. వీరికి బాధితుల కష్టం గానీ, తాము తీసుకున్న డబ్బుతో బాధితుల జీవితాలకు ముడిపడి ఉండే కుటుంబ, సామాజిక అంశాలు గానీ అనవసరం. నమ్మకంగా అప్పు తెచ్చుకోవడం ఆ తరువాత ఎగ్గొట్టేయడం. ఇదే తరహా మోసాలు ఇటీవలి కాలంలో కడియం మండలం పరిధిలో పెరిగిపోతున్నాయి.

వ్యాపారం కోసమని..

సాధారణంగా ఏదో ఒక వ్యాపారాన్ని పెట్టి, దానిని భారీ ఎత్తున విస్తరిస్తున్నారు. తద్వారా పలువురి దృష్టిని ఆకర్షిస్తున్నారు. వ్యాపారంలో పెట్టుబడి అంటూ అప్పు రూపంలో డబ్బులు పోగేస్తున్నారు. ఆ తర్వాత ముఖం చాటేస్తున్నారు. వడ్డీకి ఆశపడి అప్పులు ఇచ్చిన వాళ్లు గొల్లుమని నెత్తీనోరూ బాదుకుంటూ పోలీస్‌స్టేషన్ గడప తొక్కుతున్నారు. తీరా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తే రుణాలు ఎగ్గొట్టిన వాళ్ల పేరిట సెంటు భూమి కూడా ఉండడం లేదు. ఇలా ఉద్దేశ పూర్వకంగా మోసం చేసే వాళ్లు కొందరైతే, చేస్తున్న వ్యాపారాల్లో దెబ్బతిని కోలుకోలేని వారు ఇంకొందరు కూడా రుణాలు ఎగ్గొట్టే బాటనే ఎంచుకుంటున్నారు. ఇటువంటి వారు ముందుగానే ప్రణాళిక ప్రకారం ఐపీ నోటీసులు కూడా ఇచ్చి తమపైకి ఎటువంటి ఉపద్రవాలు రాకుండా జాగ్రత్తలు కూడా పడుతున్నారంటున్నారు. చట్ట ప్రకారం కేసులు నమోదు చేసినప్పటికీ మోసగాళ్లకు శిక్షలు పడుతున్నాయి తప్పితే బాధితులకు కోల్పోయిన డబ్బుకు మాత్రం న్యాయం జరగడం లేదు.

బాధితుల ఆవేదన

మండల కేంద్రమైన కడియంలో ఇటీవల వెలుగు చూసిన జయరామ్ ఎలక్ట్రికల్స్ అధినేత ధనుంజయరావు అలియాస్ జయరామ్ విషయంలోనూ ఇదే తరహా మోసం జరిగిందని బాధితులు వాపోతున్నారు. రాజానగరం వద్ద భూములు కొని ప్లాట్లు వేసి అమ్మితే లాభాలు భారీగా వస్తున్నాయని.. తద్వారా అధిక వడ్డీలు ఇస్తానని నమ్మబలికాడని చెబుతున్నారు. జయరామ్ మాటలు నమ్మి ఒకరికి తెలియకుండా మరొకరు కోట్లాది రూపాయలను అప్పుగా ఇచ్చేశారు. ఇలా ఇచ్చిన వారిలో అత్యధికులు అతడి బంధువులు, స్నేహితులే కావడం గమనార్హం. తీరా ఇప్పుడు చూస్తే ఆ భూములు మాట పక్కన పెడితే జయరామ్ పేరిట కూడా ఎటువంటి ఆస్తులు లేకుండా ముందు జాగ్రత్త పడ్డాడని తెలుస్తోంది. పలువురి నోట్లు కూడా గడువు తేదీలు దాటిపోతుండడంతో బాధితుల ఆందోళన మరింతగా పెరుగుతోంది. దీంతో తాము ఇచ్చిన అప్పు తిరిగి రాబట్టుకోవడం ఎలాగో అర్థం కాక కన్నీటి పర్యంతమవుతున్నారు. సెంటు రూ. రెండు, మూడు లక్షలు కూడా చేయని భూమిని రూ.పది లక్షలు పలుకుతుందని, డబ్బులు ఇవ్వలేను గానీ, ఆ భూమిని రాస్తానంటూ బేరసారాలు సాగిస్తున్నాడంటున్నారు. అయితే తాము ఇచ్చిన అప్పులు పదోవంతు కూడా విలువ చేయని భూమిని తీసుకుని తామేం చేయాలని బాధితులు తలలు పట్టుకుంటున్నారు.

వెలుగులోకి పలు ఘటనలు

కాగా జయరామ్ కేసు తాజాగా బయటపడింది కానీ, కడియం మండలం పరిధిలో పలు గ్రామాల్లో ఇటువంటి కేసులు ఉన్నాయని పలువురు చెబుతున్నారు. ఇటీవలే కడియం మండలం వేమగిరి గ్రామానికి చెందిన ఒక మహిళ ఇదే విధంగా చుట్టుపక్కల వారు, తెలిసిన వారి నుంచి అప్పులు తీసుకుంది. ఆ తరువాత తానివ్వలేనని తేల్చేసింది. మురమండ గ్రామానికి చెందిన ఒక కిరాణా వ్యాపారి కూడా ఇదే విధంగా డబ్బులు ఇవ్వలేనని చేతులెత్తేశాడు. దుళ్ల, వీరవరం, లంక గ్రామాల్లో కూడా పలువురు ఇదే రీతిలో రుణదాతలకు ముఖం చాటేస్తున్న వాళ్లు ఉన్నారు. వీటిలో అత్యధికం పోలీసుల దృష్టికి రావడం లేదని తెలుస్తోంది. విషయం బయటకు తెచ్చి రోడ్డున పడితే తమకు అందాల్సిన డబ్బులు రాకుండా పోతాయేమోనన్న ఆందోళన బాధితుల్లో కనిపిస్తోంది. వడ్డీలకు ఆశపడి ఇలా ప్రైవేటు వ్యక్తులకు రుణాలు ఇచ్చి మోసపోయేకంటే.. నమ్మకమైన ప్రభుత్వ పెట్టుబడి పథకాల్లో పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

- ఎంపీ భరత్ రామ్
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ మార్గాని భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్టు ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక 45వ డివిజన్ ఆర్అండ్‌బీ వాంబే గృహాల ప్రజల దీర్ఘకాల సమస్యకు ఆదివారం పరిష్కార చర్యలు చేపట్టారు. వాంబే గృహాలలో 15 నుంచి 30 బ్లాక్‌ల మరుగుదొడ్ల నీరుపోయే పైపులైన్ వేసేందుకు, అలాగే రూ.87 లక్షలతో చేపట్టనున్న సెప్టిక్ ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభించారు. బైపాస్ రోడ్డు నుంచి గానుగ వీధి మీదుగా ప్రదీప్ డయాగ్నోస్టిక్ సెంటర్ వరకూ రూ.కోటి అంచనాతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ వాంబే గృహాలలో నివసిస్తున్న ప్రజల ఇబ్బందులను గత ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల అవసరాలు, సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం, గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమాల్లో భాగంగా డివిజన్లలో పర్యటిస్తున్నప్పుడు వాంబే గృహాల ప్రజలు అనేక సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ముఖ్యంగా సెప్టిక్ ట్యాంక్, టాయిలెట్ల నుంచి నీరు పోయేందుకు పైపులైన్, కమ్యూనిటీ హాలు, రహదారులు కావాలని అడిగారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.87 కోట్లతో ఆయా పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఈ ప్రాంత ప్రజల కోరికపై కమ్యూనిటీ హాలు నిర్మించడం జరిగిందని, దానిని కూడా ప్రారంభించినట్టు తెలిపారు. మరో కోటి రూపాయలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమానికి వచ్చినప్పుడు ఈ ప్రాంత ప్రజలు బ్లేడ్ బ్యాచ్ గురించి ఆందోళన చెందారని, వెంటనే పోలీసు నిఘా పెట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, 45వ డివిజన్ ఇన్‌చార్జి కస్సే రాజేష్, 7వ డివిజన్ ఇన్‌చార్జి ఎండీ రఫీ గౌస్, నగర పాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావు, పార్టీ నాయకులు మజ్జి అప్పారావు, ఆరిఫ్ ఖాన్, సప్పా ఆదినారాయణ పాల్గొన్నారు.

డ్రైనేజీలు తక్షణమే శుభ్రం చేయించాలి

డ్రైనేజీల్లో పూడికలు పేరుకుపోయి అధ్వానంగా తయారయ్యాయని, వాటిని వెంటనే శుభ్రం చేయించాలని నగర పాలక సంస్థ ఎంహెచ్ఓ వినూత్నకు ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆదేశించారు. ఆదివారం లాలా చెరువు సమీపంలో రోడ్డుకు ఒక వైపున వర్షపు నీరు నిలిచిపోయి ఉండటంతో రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఆ పక్కనే మురుగు కాలువలో నీరు నిలిచిపోవడంతో ఎంహెచ్ఓకు ఫోన్ చేసి, డ్రైనేజీల అధ్వాన పరిస్థితిని వివరించారు. ఎంపీ వెంట వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు ఉన్నారు.

పరామర్శ

కడియం: పితృవియోగంతో బాధపడుతున్న జర్నలిస్టు వంగపండు వీరభద్రరావు, ఆయన కుటుంబ సభ్యులను ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదివారం పరామర్శించారు. వీరభద్రరావు తండ్రి రామకృష్ణ ఇటీవల కన్నుమూశారు. ఈ నేపథ్యంలో స్థానిక భాస్కర్‌రామ్ నగర్‌లోని వారి స్వగృహానికి వచ్చిన ఎంపీ... రామకృష్ణ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్రకార్యదర్శి రావిపాటి రామచంద్రరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సిటీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఐఎన్‌ఏ మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకుడు ఆరేటి వెంకట్రావు ఉన్నారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం



అడ్వకేట్ బాలసుందర్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రిహిల్స్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం బొమ్మూరులోని జీబీ ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవరపల్లి అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కొవ్వూరి రామిరెడ్డి, సెక్రటరీగా దోనిపాటి అప్పాజీ, ట్రెజరర్‌గా యెనుముల విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీగా చిలుకూరి ప్రవీణ్, మరికొందరిని ఎన్నుకున్నారు. ఎనిమిదేళ్లగా బొమ్మూరు పరిధిలోని 14/2000 ఎల్‌పీ నంబర్ 107 ఎకరాలకు సంబంధించి బొమ్మూరు పంచాయతీ ప్లాన్‌అప్రూవల్స్ ఇవ్వలేదు. దీంతో వారిపై హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్ విజయం సాధించారు. ప్లాట్ ఓనర్స్ తరపున వాదించిన అడ్వకేట్ బాలసుందర్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

యువకుల మధ్య ఘర్షణ

అనపర్తి: ఇరువర్గాల మధ్య ఘర్షణలో ముగ్గురు యువకులు గాయాలబారిన పడిన సంఘటన ఆదివారం అనపర్తిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దుప్పలపూడికి చెందిన సీహెచ్ గణపతి అతడి మిత్రులు దివాకర్, శ్రీతేజలు ఆదివారం సాయంత్రం దుప్పలపూడి నుంచి అనపర్తి వస్తున్నారు. వివేకానంద సెంటర్ సమీపంలో విజయ్ అనే మరో యువకుడితో ఏర్పడిన ఘర్షణ కొట్లాటకు దారి తీసింది. ఇది గమనించిన విజయ్ స్నేహితుడు ఎం.నగేష్ అక్కడకు చేరుకుని వారిని విడదీస్తుండగా దివాకర్ అతడిని కరిచి గాయం చేయడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దాడిలో గణపతి, దివాకర్‌లు తీవ్రంగా గాయపడ్డారంటూ వారిద్దరినీ వారి స్నేహితులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు చాతీపై గాయమైన గణపతికి తొమ్మిది కుట్లు, దివాకర్‌కు కంటిపై రెండు కుట్లు వేశారు. గణపతిపై ఎవరూ దాడి చేయలేదని, తనపై కేసు పెడతారనే ఉద్దేశంతో తనకు తానే బ్లేడుతో చాతీపై కోసుకున్నాడని విజయ్ చెబుతున్నాడు. దివాకర్, గణపతిలు మత్తులో ఉన్నారని స్థానికులంటున్నారు. అయితే యువకులు గంజాయి తాగి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ పి.అప్పారావు ఆసుపత్రికి చేరుకుని ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాస్తవాలు తెలుసుకునేందుకు విచారణ చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

షర్మిలారెడ్డికి హ్యూమన్ ఎక్సలెన్స్ గోల్డెన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

సీటీఆర్ఐ: రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డికి అమెరికా యూనివర్సిటీ హ్యూమన్ ఎక్సలెన్స్ గోల్డెన్ అవార్డు అందజేయడం అభినందనీయమని అమెరికా యూనివర్సిటీ ప్రతినిధి మధుకిషన్ అన్నారు. స్థానిక దహించు ఆగ్ని ఆడిటోరియంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో షర్మిలారెడ్డికి అమెరికా యూనివర్సిటీ ప్రదానం చేసిన అవార్డు, ఎక్సలెన్స్ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ అమెరికా యూనివర్సిటీ ఇచ్చే ఈ అవార్డుకు 121 మంది గవర్నర్లు ఆమోదం తెలిపారన్నారు. షర్మిలారెడ్డి చేస్తున్న సమాజ సేవలను గుర్తించి ఈ పురస్కారం అందించారన్నారు. డాక్టర్ థామస్ మాట్లాడుతూ షర్మిలారెడ్డి మరిన్ని ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. షర్మిలారెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డుని తీసుకోవడం చాలా గౌరవంగా భావిస్తున్నానన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

సీతానగరం: చినకొండేపూడి పంచాయతీ పరిధిలోని పెదకొండేపూడిలో సీతానగరం, రఘుదేవపురం, చినకొండేపూడికి చెందిన ఏడుగురు పేకాట ఆడుతుండగా అరెస్టు చేశామని ఎస్సై కె.శుభశేఖర్ ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ 7,360 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

ఘనంగా వేగుళ్లమ్మ అమ్మవారి సంబరం

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో వేగుళ్లమ్మ అమ్మవారి సంబరం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు. గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలు, కోలాటం, దేవతామూర్తుల వేషధారణ నడుమ బాణసంచా కాల్పులతో వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ గృహసారథి జొన్నలగడ్డ సత్యనారాయణ నివాసం వద్ద అమ్మవారి పొంపు నిర్వహించారు. వేగుళ్లమ్మ సంబరం కమిటీ ఆధ్వర్యంలో రాత్రి 10 గంటల వరకు అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

నగరాభివృద్ధికి రౌతు విశేష కృషి



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

- ఎమ్మెల్యేగా ఆయన సేవలు అభినందనీయం
- 'గోదావరి గళం' పుస్తకావిష్కరణలో ఎంపీ భరత్‌రామ్



సభలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యేగా (2004 – 2014) రౌతు సూర్యప్రకాశరావు నగరాభివృద్ధికి విశేష కృషి చేశారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. రౌతు సాధించిన విజయాలపై రూపొందించిన 'చట్ట సభలలో గోదావరి గళం' పుస్తకావిష్కరణ ఆదివారం కొత్తపేట రౌతు తాతాలు కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రౌతు సూర్యప్రకాశరావు ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా ఒక గుర్తింపు తెచ్చుకున్నారని, మంచి మనిషిగా, మంచి నాయకుడిగా ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. రాష్ట్ర విభజన అంశంపై మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌పై యూపీఏ, ఎన్డీఏ ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తూ డడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ అన్యాయంగా విడదీసిందని అందుకే రాష్ట్రంలో ఆ పార్టీ తుడుచు పెట్టుకుపోయిందన్నారు. ప్రస్తుతం బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉండటంతో మన ఎంపీలు ఏమీ చెప్పినా, కోరినా అరణ్య రోదనగానే మిగిలిపోతోందన్నారు. అయినప్పటికీ లోక్‌సభ, రాజ్యసభల్లో అవకాశం, సమయం వచ్చినప్పుడల్లా మన రాష్ట్ర ప్రజల వాణి వినిపిస్తూనే ఉన్నామన్నారు. రాష్ట్ర విభజనకు సంబంధించి ప్రైవేట్ బిల్లును వైఎస్సార్ సీపీ లోక్‌సభకు సమర్పించడం జరిగిందని, త్వరలోనే చర్చకు వస్తుందన్నారు. ప్రత్యేక హోదా విషయంపై పార్టీలకు అతీతంగా పోరాడాలని పిలుపు నిచ్చారు.

తరలివచ్చిన ప్రముఖులు

రౌతు సూర్యప్రకాశరావు దశాబ్దం పాటు తన గళాన్ని శాసనసభలో ప్రస్తావించిన సమస్యలను శ్రీపాద శ్రీనివాస్ కూర్పుచేసి 'చట్టసభల్లో గోదావరి గళం' పేరుతో పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకావిష్కరణకు పార్టీలకు అతీతంగా ప్రముఖులు తరలివచ్చారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులను రౌతు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్, ప్రముఖ మానసిక వైద్యనిపుణులు కర్రి రామారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, ప్రముఖ నాట్యాచారుడు సప్పా దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పంతం కొండలరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, బీజేపీ నాయకులు యెనుమూరి రంగబాబు, అడబాల రామకృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మద్దుల మురళీకృష్ణ, అశోక్ కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మహీంద్రా అడ్వెంచర్ క్యాంప్



అడ్వెంచర్ క్యాంప్‌లో డ్రైవ్ చేస్తున్న ఎంపీ భరత్ రామ్

కడియం: బుర్రిలంక గ్రామంలోని ఇసుకర్యాంపు వద్ద ఆదివారం మహీంద్రా థార్ అడ్వెంచర్ క్యాంప్ నిర్వహించారు. ఎంపీ, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్ మార్గాని భరత్‌రామ్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడే ఉన్న జీప్‌లో కూర్చుని సీటు బెల్టు పెట్టుకుని, టోపీ ధరించి డ్రైవ్ చేశారు. ఇసుక, పెద్ద గుట్టలు, వాటిపై నుంచి వేగంగా జీప్ నడిపి ఆకట్టుకున్నారు. ఎక్కడ నుంచి ప్రారంభించారో మళ్లీ అదే ప్రాంతానికి చేరుకోగానే ఆయనను ఆ క్యాంప్‌లో పాల్గొనేందుకు వచ్చిన యువత అభినందించారు. పార్టీ నాయకులు రావిపాటి రామచంద్రరావు, అడపా శ్రీహరి, ఎస్వీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రూరల్ నియోజకవర్గం పరిధిలో ఉన్న నగరపాలక సంస్థ ఎనిమిది డివిజన్లలో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. స్థానిక చందన గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన వార్డు సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బంది ఉండకూడదన్నారు. డివిజన్లలో సమస్యలను ముందుగానే తెలియజేస్తే, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. అలాగే వార్డు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు తీసుకువచ్చే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ రాజమౌళి, అంగాడ సత్యప్రియ తదితరులు పాల్గొన్నారు.

విద్యాదీవెనతో బంగారు భవిత

సీటీఆర్ఐ: పేద విద్యార్థులందరూ ఉన్నత చదువులు చదవాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయం. అందుకోసం అనేక అనేక పథకాలు, కార్యక్రమాలతో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. దానిలో భాగంగా అమలు చేస్తున్న జగనన్న విద్యాదీవెన పథకం ఎందరో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఈ పథకానికి సంబంధించి మూడో త్రైమాసికంగా జిల్లాలోని విద్యార్థులకు ప్రభుత్వం రూ.23.70 కోట్లు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలు తెలియజేశారు.

దేవుడిచ్చిన వరం



రాజమహేంద్రవరంలోని ఉమెన్స్ కళాశాలలో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నాను. జగనన్న విద్యాదీవెన పథకం మాలాంటి వారికి దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను. చదువుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడే వారికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఒక అన్నలా, మేనమామలా సాయం చేస్తున్నారు. – ఎస్.ఉమాభారతి, విద్యార్థిని

ఆర్థిక చేయూత



చదువుకునే ఆర్థిక స్థితి లేని పేద వర్గాల పిల్లలకు నేనున్నానంటూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారు. విద్యాదీవెన పథకం ద్వారా ఆర్థిక చేయూత అందజేస్తున్నారు. పేద పిల్లలు ఉన్నత చదువులు చదివేందుకు ఎంతో సాయం చేస్తున్నారు.

– పి.మాధవరెడ్డి, విద్యార్థి

చదువుకు ఆటంకం లేకుండా..



జగనన్న గొప్ప మనస్సుతో నాకు ఎంతో ఆర్థిక భరోసా ఇస్తున్నారు. జగనన్న విద్యాదీవెన ద్వారా చదువు ఎటువంటి ఆటంకం లేకుండా సాగుతోంది. ఆర్థిక ఇబ్బందుల సమయంలో సీఎం జగనన్న విద్యా పథకం ఎంతగానో ఆదుకుంటోంది.

– పి.సాత్విక, విద్యార్థిని

నెరవేరుతున్న ఆశయం



పేదరికంలో ఉన్న ప్రతి ఒక్కరూ చదువుకుని ఉన్నత స్థితిలో ఉండాలన్నదే సీఎం జగనన్న ఆశయం. ఆయన సంకల్పం మాలాంటి పేద కుటుంబాలకు ఎంతో అండగా ఉంటోంది. చదువుకోవాలన్న నా ఆశయాన్ని జగనన్న విద్యాదీవెన పథకం నెరవేర్చుతోంది.

– జి.అనూష, విద్యార్థిని

పండితులకు సత్కారం

బిక్కవోలు: మండలంలోని గోలింగేశ్వరస్వామి ఆలయ పండితులను ఆదివారం ఘనంగా సత్కరించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ పండితుల సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తమ్మినేని నాగశ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.